సాక్షి పెద్దపల్లి

గురువారం । 19 । అక్టోబర్ । 2023

బతుకమ్మ సంబురం

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్ ఆవరణలో బుధవారం బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, అధికారులు, ఉద్యోగులు ఆడిపాడారు.



న్యూస్‌రీల్

పకడ్బందీగా ఏఈ పరీక్ష



పరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో టీఎస్ పీఎస్సీ చేపట్టిన అసిస్టెంట్ ఇంజినీర్ పరీక్షను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక మదర్ థెరిసా ఇంజినీరింగ్ కాలేజీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ప్రారంభమైన పరీక్ష గురువారం కూడా నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పేర్కొన్నారు. తహసీల్దార్ రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన సంధ్యారాణి



సంధ్యారాణిని అభినందిస్తున్న కిషన్‌రెడ్డి

గోదావరిఖని/పాలకుర్తి: పాలకుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు, బీఆర్ఎస్ నాయకురాలు కందుల సంధ్యారాణి బుధవారం బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె అనుచరులు కూడా బీజేపీలో చేరారు. రాబోయే ఎన్నికల్లో ఆమెకు రామగుండం నుంచి బీజేపీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

రిజర్వాయర్‌లోకి సాగునీటి విడుదల

ముత్తారం: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గుండారం రిజర్వాయర్ నుంచి ముత్తారం మండలం శుక్రవారంపేట చింతలచెరువు రిజర్వాయర్‌లోకి బుధవారం సాగునీరు విడుదల చేశారు. చింతలచెరువు రిజర్వాయర్ నుంచి వివిధ గ్రామాల్లోని ఉపకాలువ ద్వారా పంటలకు సాగునీరు అందుతుంది. జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు సాగునీరు అందుతోందని మాజీ ఎంపీపీ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు రైతులతో కలిసి బుధవారం ఆయన సాగునీటిని పరిశీలించారు.

ఎన్టీపీసీ సందర్శన

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టును సంస్థ ఈడీ టూ సీఎండీ అధికారి కె.షణ్ముగ సుందరం బుధవారం సందర్శించారు. పర్మినెంట్ టౌన్‌షిప్ జ్యోతిభవన్ నుంచి తెలంగాణ స్టేజీ–1లోని 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల రెండోయూనిట్‌ను పరిశీలించారు. మొదటి యూనిట్‌ను ఇటీవల ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. రెండోయూనిట్‌ను డిసెంబర్‌లోగా కమర్షియల్ డిక్లరేషన్ చేసే పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నల్లసూరీలతో రాహుల్‌గాంధీ మాటాముచ్చట



పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాహుల్ సభకు ఏర్పాట్లు

- నేడు ఉమ్మడి జిల్లాలో ఏఐసీసీ నేత పర్యటన
- పెద్దపల్లిలో బహిరంగ సభ, కరీంనగర్‌లో పాదయాత్ర
- సెంటినరీకాలనీలో కార్మికులతో సమావేశం
- భద్రతను పర్యవేక్షిస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి: ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టిన బస్సుయాత్ర రెండోరోజు పెద్దపల్లిలో కొనసాగనుంది. ఇందుకు సంబంధించి కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రాహుల్‌గాంధీ పాల్గొనే కార్యక్రమాలకు జాతీయ, రాష్ట్ర నాయకత్వం తరలిరానున్న నేపథ్యంలో భద్రతను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

మంథని – కరీంనగర్ పర్యటన ఇలా..

రాహుల్‌గాంధీ గురువారం ఉదయం భూపాలపల్లి జిల్లాలో పర్యటన ముగించుకొని బస్సులో పెద్దపల్లి జిల్లా మంథనిలో ప్రవేశించనున్నారు. అక్కడ కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంథనిలో రోడ్ షోలో పాల్గొన్న అనంతరం రామగిరి మండలం సెంటినరీకాలనీలో మధ్యాహ్నం రాష్ట్ర నాయకులతో కలిసి భోజనం చేస్తారు. తర్వాత సింగరేణి కార్మికులు, రైతులతో సమావేశమవుతారు. వారితో మాట్లాడాక బస్సులో కమాన్‌పూర్ చౌరస్తాకు చేరుకొని, రోడ్ షోలో పాల్గొంటారు. సబ్బితం నుంచి బైక్ ర్యాలీ ద్వారా పెద్దపల్లి బహిరంగ సభకు సాయంత్రం 4 గంటలకు చేరుకుంటారు. భారీ బహిరంగ సభ అనంతరం రాత్రి 7 గంటలకు కరీంనగర్ చేరుకొని, 10 గంటల వరకు పాదయాత్ర చేయనున్నారు. అక్కడే బస చేయనున్నారు.

40 వేల మందితో భారీ బహిరంగ సభ

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో బహిరంగ సభ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాలకు చెందిన సుమారు 40 వేల మంది పాల్గొననున్నారు. సభా ప్రాంగణంలో భద్రత ఏర్పాట్లను రాహుల్‌గాంధీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఉన్నతాధికారులు, పెద్దపల్లి పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు సభాస్థలిని పరిశీలించారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక ఫోకస్

అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం ఉమ్మడి కరీంనగర్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఇప్పటికే ఏడుగురు అభ్యర్థులను ప్రకటించింది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఉమ్మడి జిల్లాలో బస్సు యాత్ర చేపడుతుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మొత్తం 13 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా అధిష్ఠానం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

బస్సుయాత్రకు భారీ భద్రత

మంథని: ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ బస్సుయాత్రకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి కాటారం, మంథని మండలం ఎక్లాస్‌పూర్ వరకు అడవులు విస్తరించి ఉన్నాయి. అయితే, ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం లేకున్నా.. పక్కరాష్ట్రాల్లో ఉనికి చాటుతున్నారు. దీంతో రాహుల్ పర్యటనకు కనీవినీఎరుగని బందోబస్తు చేపట్టారు. రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి పర్యవేక్షణలో పెద్దపల్లి ఇన్‌చార్జి డీసీపీ సుధీర్ రాంనాథ్ కెకన్, పెద్దపల్లి, గోదావరిఖని ఏసీపీలు మహేశ్, శ్రీనివాసరావు, సీఐ సతీశ్‌తోపాటు సుమారు 300 మంది పోలీసుల బలగాలను మోహరించారు. కాగా, ఏఐసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు నియోజకవర్గం కావడంతో రాహుల్ పర్యటనపై కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంతో ఉన్నారు.



కరీంనగర్ సభలో మాట్లాడుతున్న ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు

'గంగుల' అంటేనే ప్రత్యర్థులు జంకుతున్నరు!

- కాంగ్రెస్, బీజేపీ నేతలు పారిపోతున్నరు
- కాంగ్రెస్, బీజేపీలను దరిదాపుల్లోకి రానివ్వొద్దు
- ఆంధ్రా నాయకులొస్తున్నారు జాగ్రత్త
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావు



మంత్రి కేటీఆర్ రోడ్‌షో..

సాక్షిప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్: మంత్రి కమలాకరన్నపై పోటీ చేసేందుకు అందరూ జంకుతున్నారని, కాంగ్రెస్ వాళ్లు హుస్నాబాద్ పారిపోయారని, బీజేపీ వాళ్లు పోటీకి వెనకాముందు ఆడుతున్నారని, గంగుల మీద పోటీ అంటే పోచమ్మ గుడి ముందు పొట్టేలు కట్టేసినట్లేనని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన 'ప్రజా ఆశీర్వాద' సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ.. కరీంనగర్‌లో గంగుల విజయం ఖాయమని స్పష్టం చేశారు. బీజేపీ నుంచి ఎంపీ అయిన బండి సంజయ్ ఐదేళ్లలో చేసింది శూన్యమని, హిందూ, ముస్లింల మధ్య తగాదాలు సృష్టించి లబ్ధి పొందడమే ఆయన నైజమని ధ్వజమెత్తారు. మంత్రి కమలాకర్ ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి, గురుకులాలతో విద్యారంగం దూసుకుపోతోందని అన్నారు. కమలాకర్ చేతిలో చావుదెబ్బ తిని బండి సంజయ్ ఏడుపుతో ఎంపీ అయ్యాక నయాపైసా అభివృద్ధి చేసిన దాఖలాల్లేవని అన్నారు. మోదీ దేవుడంటున్న బండి సంజయ్.. రాష్ట్రానికి బడి తెచ్చాడా.. గుడి తెచ్చాడా? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ గొప్ప హిందువని, ఆయన చేసిన యాగాలు, యజ్ఞాలు ఎవరూ చేయలేదని స్పష్టం చేశారు. ప్రజా నాయకులు హిందూ, ముస్లిం ఐక్యత కోరుకోవాలే తప్ప.. విభజించి పాలించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. కాంగ్రెస్, బీజేపీలతో ఒరిగిందేమీలేదని, మరోసారి నమ్మితే 50 ఏళ్ల వెనక్కి వెళ్లాల్సి వస్తుందని గతాన్ని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో పదేళ్లల్లో అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే ముందున్నామని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఎన్నోమార్పులు వచ్చాయని అన్నారు. పదేళ్లలోనే గణనీయమైన అభివృద్ధి జరిగిందని, గతంలో నీళ్లకోసం జగడాలు ఉండేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, కాళేశ్వరం జలాలతో తెలంగాణ సజీవ జలధారగా మారిందని అన్నారు. తెలంగాణ కోసం చావు నోట్లో తలపెట్టిన కేసీఆర్ కావాలో.. తెలంగాణ కోసం రాజీనామాలు చేయకుండా పారిపోయిన కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి కావాలో ప్రజలు గుండెలపై చేయి వేసుకొని ఆలోచించి అభివృద్ధికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సన్నబియ్యం పథకం అమలు చేయబోతున్నామని, 15 లక్షల పరిమితితో కేసీఆర్ ఆరోగ్య రక్ష పథకంతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలన్నింటినీ దశలవారీగా అమలు చేయబోతున్నామని, మరోసారి బీఆర్ఎస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు అన్ని వర్గాల ప్రజలు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, కరీంనగర్ నగర మేయర్ వై.సునీల్‌రావు మాట్లాడారు. ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, భానుప్రసాద్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కార్పొరేషన్ చైర్మన్లు సర్దార్ రవీందర్‌సింగ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కుర్మాచలం అనిల్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేని మధు, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తోపాటు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మారిన ప్రచారాస్త్రాలు

- లాభాల వాటా, దసరా అడ్వాన్స్‌పై ప్రత్యేక దృష్టి
- చెల్లింపుల నిలిపివేతపై ఆగ్రహావేశాలు
- జోరుగా కార్మిక సంఘాల 'గుర్తింపు' ప్రచారం



గోదావరిఖని: కార్మిక సంఘాలన్నీ ఒకేగొంతుతో నినదిస్తున్నాయి.. ప్రధాన సమస్యలకన్నా కార్మికుల లాభాల వాటా, దసరా అడ్వాన్స్, దీపావళి(పీఎల్ఆర్)బోనస్ చెల్లింపులపైనే ప్రధానంగా దృష్టి సారించాయి. సింగరేణిలోని సుమారు 42వేల మంది కార్మికులు దసరా పండుగకు ముందే లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ వస్తుందని ఎదురు చూశారు. అయితే, డిసెంబర్‌లో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల ప్రచారం కోసం అన్నికార్మిక సంఘాలు నడుంబిగించాయి. గనులపై గేట్‌మీటింగ్‌ల పేరుతో ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. జాతీయ కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, ప్రస్తుత గుర్తింపు యూనియన్‌గా ఉన్న టీబీజీకేఎస్‌తోపాటు పలు విప్లవకార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలు నిర్వహించేంత వరకూ సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీచేసింది. ఈక్రమంలో గనులపై జరిగే అన్ని కార్యక్రమాలతోపాటు గేట్ మీటింగ్‌లు, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఈక్రమంలో ఎన్నికల ప్రచారానికి అన్ని యూనియన్లు ఇప్పటికే శ్రీకారం చుట్టాయి.

అన్ని యూనియన్లదీ ఒకేబాట..

ప్రస్తుతానికి సింగరేణిలో లాభాల వాటా, దీపావళి బోనస్, దసరా పండుగ అడ్వాన్స్ కార్మికులకు చెల్లించాల్సి ఉంది. వాస్తవానికి ఈనెల 16న లాభాల వాటా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాల్సి ఉంది. దసరా అడ్వాన్స్‌గా ఒక్కో పర్మినెంట్ కార్మికుడికి రూ.25వేలు, బదిలీ వర్కర్‌కు రూ.12,500 చొప్పున ఈనెల 20న బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీఅయ్యాయి. అయితే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పెద్దమొత్తంలో చెల్లింపులపై యాజమాన్యం మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పటికే పలువురు పోలీసు అధికారులతోపాటు కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో ఉన్నాధికారులు అప్రమత్తమయ్యారు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు లాభాల వాటా, దసరా అడ్వాన్స్, దీపావళి బోనస్ చెల్లింపులపై ఎన్నికల సంఘం అనుమతి కోసం లేఖ రాసింది. అయితే దీనిపై ఇంకా ఎటూ తేల్చలేదు.

చెల్లింపులపైనే ప్రధాన దృష్టి..

కార్మికులకు వెంటనే చెల్లింపులు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. యూనియన్లకు అతీతంగా గనులపై నల్లబ్యాడ్జీలతో నిరసన, ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ప్రధానంగా లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ దసరాకు ముందే అందించాలని కోరుతున్నాయి. అన్నిసమస్యలు పక్కన పెట్టి చెల్లింపులపై అస్త్రశస్త్రాలతో ముందుకు కదులుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోకుంటే సమ్మెకైనా వెనుకాడబోమని అన్నికార్మిక సంఘాలు ఇప్పటికే అల్టిమేటం జారీచేశాయి.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతోవిలువైదని, అర్హులైనవారు తమ హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ నుంచి కాలేజీ వరకు బుధవారం నిర్వహించిన ఓటరు అవగాహన ర్యాలీలో కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఆర్డీవో మధుమోహన్ పాల్గొన్నారు. 18ఏళ్ల వయసు నిండినవారు ఓటరు జాబితాలో తమపేరు చెక్ చేసుకోవాలన్నారు. కొత్తగా పేరు నమోదుకు ఈనెల 30 వరకు అవకాశం ఉందని తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి..

వచ్చే ఎన్నికల్లో ఓటుహక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ప్రలోభాలకు లోనుకావొద్దని అన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఆర్డీవో మధుమోహన్, స్వీప్ యాక్టివిటీస్ నోడల్ అధికారి రవుఫ్‌ఖాన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, తహసీల్దార్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మోసపోతే.. గోసపడుతాం



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: మోసపూరిత మాటలు నమ్మితే గోసపడతామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి, ఓసీపీ–3లో ఆయన పర్యటించి కార్మికులతో మాట్లాడారు. ఎనాడూ ప్రజల మధ్య ఉండనివాళ్లు, వారికోసం పనిచేయనివాళ్లు, వారి అవసరాలు తీర్చనివాళ్లు.. ఎన్నికలు రాగానే కపటప్రేమ చూపుతున్నారని విమర్శించారు. అలాంటి ఆయారాం, గయారాంలతో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తనపై 125 కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. 45 రోజుల జైలు జీవితం గడిపానని అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపామన్నారు. సింగరేణి గనులు మూతపడితే గోదావరిఖనికి భవిష్యత్ లేదనే నానుడిని రూపుమాపి, మరోవందేళ్ల భవిష్యత్ కోసం, ప్రజలకు శాశ్వత ఉద్యోగ, ఉపాధి, సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే తాను దత్తత తీసుకుని సిరిసిల్ల, సిద్దిపేట తరహాలో అభివృద్ధి చేస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, నాయకులు రాజయ్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

మత్స్యసంపద వృద్ధి..

కాళేశ్వరంతో బెస్త కుస్తులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో బెస్త కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గోదావరి నదిలో చేపలు, రొయ్య పిల్లల పెంపకం చేపట్టి గంగపుత్రులకు ఉపాధి అవకాశాలు పెంచామన్నారు. వచ్చేనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు రాసకట్ల సాంబమూర్తి, బంగారి రాజయ్య, జీదుల సురేశ్, చింతల రవీందర్, అర్కుటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం



కార్మికులతో కలిసి నృత్యం చేస్తున్న రాజ్‌ఠాకూర్

- రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని/జ్యోతినగర్: సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఎన్టీపీసీ బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు తూము పద్మ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పాలకుర్తిలోని యాదవ సంఘం జిల్లా నాయకులు మేకల నర్సయ్య, దారవేణి సంజీవ్, కొమ్ము శ్రీనివాస్, కొమ్మ వికాస్, మేకల భూమయ్య, ముక్కెర శ్రీనివాస్, మేరుగు అశోక్, శ్రీనివాస్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. ఎకరాకు రూ.15వేల రైతుబంధు, రూ.2లక్షల వరకు రుణమాఫీ, రైతుకూలీలకు రూ.12వేల సాయం, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. బీఆర్ఎస్ అవినీతిమయంగా తయారైందని విమర్శించారు. రామగుండంలో ఆ పార్టీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, నాయకులు పాతిపల్లి ఎల్లయ్య, ఆసిఫ్‌పాషా, మచ్చకుర్తి రమేశ్, పాతిపెల్లి రవి, చుక్కల శ్రీనివాస్, తలారి శంకర్, వాసుదేవరావు, రావుల నారాయణ పాల్గొన్నారు.

కార్మికులతో కలిసి నృత్యాలు చేసిన రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా జీడీకే–5 ఓసీపీపై బుధవారం దుర్గామాత బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ వేడుకలకు హాజరయ్యారు. పోతురాజులతో కలిసి ఆయన స్టెప్పులేశారు.

జంగ్ తెలంగాణ

క్లుప్తంగా

ప్రచురణకర్తల పేరు ఉండాలి

జ్యోతినగర్(రామగుండం): ఎమ్మెల్యే అభ్యర్థుల కరపత్రాలు, పోస్టర్లను ప్రచురణకర్తల పేర్లు లేకుండా ముద్రించకూడదని రామగుండం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ ఆదేశించారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశమయ్యారు. ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర సామగ్రి ముద్రిస్తే.. ప్రింటర్, ప్రచురణకర్త పేర్లు, చిరునామా, సెల్ నంబరు ప్రింట్‌లైన్‌పై స్పష్టంగా ముద్రించాలని చెప్పారు. ప్రింట్ చేసిన మూడు రోజుల్లోగా ప్రచురణకర్త డిక్లరేషన్ సహా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు. ఆదేశాలు పాటించని వారి ప్రింటింగ్ లైసెన్సు రద్దుచేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య


సుశీల(ఫైల్)

జ్యోతినగర్: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందిన మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌లో నివాసముంటున్న మానాల సుశీల(63) కొద్దినెలలుగా మానసికస్థితి సరిగ్గా లేక అనారోగ్యంతో బాధపడుతూ ఉంది. బుధవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. మృతురాలు భర్త నారాయణ ఫిర్యాదు మేరకు ఏఎస్సై చక్రపాణి ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రాజేశ్(ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): ఆర్థిక తగాదాలతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కమాన్‌పూర్ మండలం జూలపల్లికి చెందిన ఓరుగంటి రాజేశ్(30) ఈనెల 10న ఎన్టీపీసీ కృష్ణానగర్‌లోని తన భార్య బంధువుల ఇంటికి వచ్చాడు. తనకు రావలిసిన డబ్బులు ఇవ్వాలని కోరాడు. దీంతో వారు దూషించడంతో మనస్తాపం చెందాడు. పురుగుల మందు తాగడంతో కుటుంబసభ్యులు ఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు. చికిత్స అనంతరం రెండురోజుల క్రితం ఆస్పత్రి నుంచి జూలపల్లిలోని తన నివాసానికి తరలించారు. బుధవారం ఆరోగ్యం క్షీణించడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా మృతి చెందాడు. తన కుమారుడి మృతికి కోడలు వసంతతోపాటు మరో నలుగురు కారణమని మృతుడి తండ్రి శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పండుగ రైళ్ల ప్రస్తావనే లేదు!

- కోల్‌బెల్ట్‌వాసులపై నిర్లక్ష్యం
- పెరిగిన ప్రయాణికుల రద్దీ
- ప్రైవేట్ వాహనాలే దిక్కు

రామగుండం: తెలంగాణలో అతిపెద్ద పండుగలు సద్దుల బతుకమ్మ, దసరా(విజయదశమి). వివిధ జిల్లాలకు చెందిన వేలాది మంది ఉపాధి కోసం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వెళ్లి పనులు చేసుకుంటున్నారు. అయితే, దసరాకు సొంత ఊళ్లకు వెళ్లిరావడం ఆనవాయితీ. ఇలాంటి వారికోసం దక్షిణమధ్య రైల్వే అధికారులు హైదరాబాద్ కేంద్రంగా పండుగకు ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నామని ఇటీవల ప్రకటించారు. కానీ, అందులో తెలంగాణకు చోటుదక్కలేదు. కేవలం ఆంధ్రప్రదేశ్‌కు అత్యధికంగా కేటాయించారని తెలంగాణవాసులు, ముఖ్యంగా సింగరేణి సంస్థవ్యాపించిన జిల్లాల ప్రజలు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా కాజీపేట, వరంగల్, కాగజ్‌నగర్, బల్హార్షా, చంద్రపూర్, నాగపూర్, డోర్నకల్, ఖమ్మం, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం తదితర మార్గాల్లో స్పెషల్ రైళ్లు నడిపిస్తే ప్రయాణికుల కష్టాలు తీరుతాయి. రైల్వేశాఖకు అదనపు ఆదాయమూ సమకూరుతుంది.



రామగుండం రైల్వేస్టేషన్

ప్రైవేట్ వాహనాలే దిక్కు..

- దసరా పండుగకు ఏటా హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు తరలివెళ్తుంటారు.
- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైళ్లు నడిపించడంలేదు.
- దీంతో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలనే ప్రజలకు దిక్కవుతున్నాయి.
- వీటిలో ప్రయాణించడం అత్యధిక వ్యయప్రయాసలతో కూడుకున్నది.
- రద్దీ అధికం కావడంతో ఇబ్బందులూ తప్పడంలేదు.
- కోల్‌బెల్ట్ ఏరియా ప్రజలు దసరా సంబురాలు ఎంతోవైభవంగా జరుపుకుంటారు.
- వివిధ ప్రాంతాల్లోని ప్రజలు తమ స్వస్థలాలకు కుటుంబాలతో సహా తరలివస్తుంటారు.
- వీరికోసం ప్రత్యేకంగా రైళ్లు నడిపించాలని పలువురు కోరుతున్నారు.

సింగరేణితో లాభాలు



సింగరేణి బొగ్గు రవాణాతో రైల్వే శాఖకు ఏటా రూ.కోట్ల ఆదాయం సమకూరుతోంది. అయినా ప్రయాణికుల సౌకర్యం కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేకంగా రైళ్లు నడిపించడంలేదు. అధికారుల తీరు దురదృష్టకరం. సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకుని ప్రత్యేక రైళ్లు నడిపించేలా చూడాలి.

– రాచకొండ కోటేశ్వర్లు, గోదావరిఖని

పాలకులదే నిర్లక్ష్యం



సాధారణ, మధ్య తరగతి ప్రయాణికుల అవసరాలను గుర్తించి పండుగలకు ప్రత్యేక రైళ్లు నడిపించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. కోల్‌బెల్ట్ ఏరియాల మీదుగా వీటిని నడిపించేందుకు పార్లమెంట్ సభ్యులు రైల్వే అధికారులపై ఒత్తిడి తేవాలి. పాలకులు నిర్లక్ష్యం వీడి ప్రజావసరాలు గుర్తించాలి.

– కొండపర్తి సంజీవ్, గోదావరిఖని

లాభాపేక్ష వద్దు



రైల్వే శాఖ లాభాలాపైనే దృష్టి సారిస్తున్నది. దసరా సీజన్‌లో హైదరాబాద్ నుంచి లక్షలాది మంది సింగరేణి ఏరియాలోని స్వస్థలాలకు వస్తుంటారు. కోల్‌బెల్ట్ రూట్లలో ఫెస్టివల్ స్పెషల్ రైళ్లను నడిపించాలి. సాధారణ ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి తేవాలి.

– ఆముల నారాయణ, రామగుండం

జల్సాలకు అలవాటు పడి.. చోరీలు చేసి

పట్టుబడిన అంతర్ జిల్లా దొంగల ముఠా

సిరిసిల్లక్రైం: జల్సాలకు అలవాటుపడిన వారు.. దొంగతనాలు చేయడం మొదలెట్టారు. ఏకంగా అంతర్‌జిల్లా దొంగలముఠాగా ఏర్పడి వరుస దొంగతనాలతో బెంబేలెత్తించిన ముఠాను రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీసులు పట్టుకొని జైలుకు పంపారు. వారి నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన 20.5 తులాల బంగారు ఆభరణాలు, 43 తులాల వెండి అభరణాలు, రెండు బైక్స్, దొంగతనం చేసేందుకు వాడే ఐరన్‌రాడ్, కట్టర్, స్క్రూ డ్రైవర్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రామారావుపల్లెకు చెందిన రామటంకి సారయ్య, భూతం రాములు ముఠాగా ఏర్పడి పలు జిల్లాలో దొంగతనాలకు పాల్పడ్డారు. దాదాపు పదేళ్లుగా దొంగతనాలు చేస్తూ ఇప్పటికే జైలుకు వెళ్లి వచ్చారు. 2012 నుంచి 2016 వరకు బసంత్‌నగర్, కోనరావుపేట, తంగళ్లపల్లి, చిగురుమామిడి, చొప్పదండి, రామడుగు, మానకొండూరులో పలు దొంగతనాలు చేయగా 2017 సంవత్సరంలో పీడీయాక్ట్ నమోదైనట్లు వివరించారు. 2019లో జైలు నుంచి బయటకు వచ్చి జమ్మూకాశ్మీర్ వెళ్లి ఆ తర్వాత కరీంనగర్ వచ్చి కోళ్ల ఫాంలో కోళ్ల దొంగతనాలు చేయగా అరెస్టు చేసి పీడీయాక్ట్ పెట్టి పది నెలలు జైల్లో ఉన్నట్లు వివరించారు. 2022లో జైలు నుంచి బయటకొచ్చిన తర్వాత జగిత్యాల జిల్లాలో అద్దె గదిలో ఉంటూ హెల్మెట్లు, అద్దాలు, రెక్సిన్ పనిచేసుకుంటున్నాడు. ఇలా వచ్చిన ఆదాయం అతని జల్సాలకు సరిపోక తన గ్రామస్తుడు భూతం రాములు దగ్గరికి వెళ్లి దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇలా సెప్టెంబర్ 27న ఇద్దరు కలిసి బస్సులో మెట్‌పల్లి వెళ్లి అక్కడ ఓ మోటార్‌సైకిల్‌ను ఎత్తుకొచ్చారు. అదే బైక్‌పై సిరిసిల్లకు వచ్చారు. అక్కడ నుంచి ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, కిష్టునాయక్ తండాలో, సెప్టెంబర్ 14న చందుర్తి మండలం గోసుకులపల్లిలో, సెప్టెంబర్ 23న మల్యాలలో, అదే రోజున జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలో, అక్టోబర్ 5న కమలాపూర్ మండలం కన్నూరులో, పెద్దపల్లి జిల్లా 8 ఇంక్లయిన్‌కాలనీ, పోతనకాలనీలో దొంగతనాలకు పాల్పడ్డారు. మూడపల్లికి చెందిన హన్మండ్లు, మాల్యాలకు చెందిన రాజయ్య ఫిర్యాదుతో చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తులో చేపట్టారు. ఈక్రమంలో ఈనెల 16న వేములవాడ నందికమాన్ వద్ద సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో చందుర్తి ఎస్సై అశోక్ నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో చురుకుగా వ్యవహరించిన డీఎస్పీ నాగేంద్రచారిని, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్‌ను చందుర్తి ఎస్సై సిరిసిల్ల అశోక్, కానిస్టేబుల్స్ సతీశ్‌ప్రమోద్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

ఎన్నికల ఫిర్యాదు, పర్యవేక్షణ కేంద్రం ఏర్పాటు


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ తీరు పర్యవేక్షించడంతోపాటు ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కేంద్రం ఏర్పాటు చేశారు. రూమ్ నంబర్ 101లో ఫిర్యాదులు, పర్యవేక్షణ కేంద్రాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం ప్రారంభించారు. ఎన్నికల నిర్వహణలో పాలుపంచుకునే అన్ని బృందాలు ఒకేచోట ఉండేలా ఫిర్యాదుల కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. సి-విజిల్, 1950 టోల్ ఫ్రీ, 24 గంటల కాల్‌సెంటర్, జీపీఎస్ మానిటరింగ్ సెల్, సువిధ యాప్ మానిటరింగ్ సెల్, ఎలక్ట్రానిక్ సోషల్ మీడియా మానిటరింగ్ సెల్, మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీలు ఇందులో పనిచేస్తాయని అన్నారు. సోషల్ మీడియాపై నిరంతరం పర్యవేక్షణ జరగాలని సోషల్ మీడియా ఇన్‌చార్జికి కలెక్టర్ సూచించారు. సూపరింటెండెంట్ ప్రకాశ్ పాల్గొన్నారు.

దేశంలోనే గొప్పనేత కేసీఆర్

ఎమ్మెల్యే కోరుకంటి చందర్


ప్రజాఅంకిత యాత్రలో ఎమ్మెల్యే చందర్

యైటింక్లయిన్‌కాలనీ: మానవీయ కోణంలో ఆలోచనచేసి ప్రజావసరాలు తీర్చేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్ దేశంలోనే గొప్ప నేత అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. 15, 16, 17, 18, 19 డివిజన్లలో బుధవారం ఆయన ప్రజాఅంకిత యాత్ర నిర్వహించారు. ఇంటింటా పర్యటిస్తూ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. మేనిఫెస్టో గురించి వివరించారు. పెదల జీవితాల్లో వెలుగు నింపేలా బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టో ఉందని చెప్పారు. 60ఏళ్లలో కాంగ్రెస్ చేసిందేమీలేదని విమర్శించారు. అభివృద్ధిని చూసి తనకు మరోఅవకాశం ఇవ్వాలని కోరారు. మంగళవారంరాత్రి శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో బస్తీనిద్ర చేసిన ఎమ్మెల్యే.. బుధవారం ఉదయం ప్రజా అంకితయాత్ర ప్రారంభించారు. ఎన్నికల ఇన్‌చార్జి నారదాస్ లక్ష్మణ్‌రావు, కార్పొరేటర్లు సాగంటి శంకర్, తొల్ల అమృత, అంజలీదేవి, మందల కిషన్‌రెడ్డి, టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, నాయకులు సదయ్య, రాజయ్య, ఓదేలు, రాంచందర్, కుమార్ నాయక్, గోపాల్‌రావు, రాకేశ్, బాలరాజు, విజయ, సంధ్యారెడ్డి, దశరథం తదితరులు పాల్గొన్నారు.

‘బిడ్డా.. నిన్ను గెలిపించుకుంటాం’


మహిళలతో ఠాకూర్

రామగుండం: ‘బిడ్డా.. ఈసారి నిన్ను గెలిపించుకుంటాం’ అని వృద్ధురాలు అభయం ఇచ్చింది. రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌ను బుధవారం అంతర్గాం మండలం మద్దిర్యాల గ్రామంలో పర్యటించారు. ఆయన జన్మించిన గ్రామం కావడంతో ఆ గ్రామస్తులు ఆయనపై అభిమానం చాటుకుంటున్నారు. వృద్ధురాలు ఆయనను ఆలింగనం చేసుకుని తన ప్రేమ పంచుకున్నారు. మహిళలు ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అయితే, త్వరలోనే ఎమ్మెల్యేగా గెలుపొంది తిరిగి గ్రామానికి వస్తావని వారు ఆశీర్వదించారు.

వాస్తవ విషయాలపై చర్చించాలి

మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు

మంథని: నియోజకవర్గంలో వాస్తవ విషయాలపై యువత చర్చించాలని మంథని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు కోరారు. ముత్తారం మండలం మైదంబండ, ఖమ్మంపల్లి ఎస్సీ కాలనీ, పాలకుర్తి మండలం జీడీనగర్, మహాముత్తారం మండలానికి చెందిన పలువురు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మంథనిలోని తన నివాసంలో మధు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మభ్యపెట్టేవాళ్లు ఎవరో, మంచిచేసేవాళ్లు ఎవరో ఆలోచన చేసి ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత యువత తీసుకోవాలని కోరారు. అనేకఏళ్ల క్రితం మహనీయులు మనగురించి, మనభావితరాల గురించి ఆలోచన చేసి జీవితాలు త్యాగం చేశారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని చెప్పారు.

దుర్గామాతకు పూజలు

మంథని, కాటారంలోని దుర్గామాతకు జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు– శైలజ దంపతులు పూజలు చేసారు. అమ్మవారిని దర్శించుకొని నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కాంక్షించారు.

సీఎం సభా స్థలి పరిశీలన

వచ్చే నెల 7న మంథనిలో సీఎం కేసీఆర్ పాల్గొనే సభాస్థలిని మధు పరిశీలించారు. గోదావరిఖని రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీప స్థలాన్ని చూసిన ఆయన.. బహిరంగ సభ, ఏర్పాట్లను పూర్తిచేయాలని నాయకులకు సూచించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డిస్కమ్స్ బాస్కెట్‌బాల్ చాంపియన్ ‘కరీంనగర్’

- వరుసగా పదోసారి విజేతగా రికార్డు సృష్టించిన ఉమ్మడి జిల్లా జట్టు


ట్రోఫీ అందుకుంటున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు

కొత్తపల్లి(కరీంనగర్): తెలంగాణ రాష్ట్ర ఇంటర్ సర్కిల్ ట్రాన్స్‌కో డిస్కమ్స్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో అదుభత ప్రదర్శనతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. టోర్నమెంట్ చరిత్రలో జట్టు వరుసగా పదోసారి విజేతగా నిలిచి రికార్డు సొంతం చేసుకుంది. హైదరాబాద్‌లో మూడురోజులుగా కొనసాగిన టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్(వోఎంసీ) జట్టుపై గెలుపొంది ఎస్పీడీసీఎల్ సీజీఎం సాయిబాబా, మేడ్చల్ ఎస్ఈ రామ్మోహన్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. జట్టు కెప్టెన్ ఈఎల్‌పీ రాజు, సభ్యులు సుధీర్ కుమార్, రాజ్ కుమార్, అనిల్ కుమార్, వినీత్ రెడ్డి, విశ్వతేజ, రమేశ్, రంగు వెంకట్ నారాయణ, వినీల్ రెడ్డి, మోయిన్‌పాషా, మేనేజర్ శ్రీధర్‌ను ఎస్ఈ వి.గంగాధర్, సత్యనారాయణ, బి.సుదర్శన్ అభినందించారు.

రామగుండం నేతకు అరుదైన అవకాశం



రామగుండం: ములుగు, పెద్దపల్లి జిల్లాల పర్యటనకు బయలు దేరిన కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ బుధవారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బేగంపేటకు చేరుకున్నారు. రామగుండం పట్టణానికి చెందిన పీసీసీ ప్రొటోకాల్ చైర్మన్, ఏఐసీసీ సభ్యుడు హర్కర వేణుగోపాల్‌రావు బేగంపేటలో రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీకి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

స్కూల్ మూసివేతకు నోటీసులు

గోదావరిఖనిటౌన్: స్థానిక మార్కండేయకాలనీలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ యాజమాన్యం ఆర్‌టీఈ నిబంధనలు ఉల్లంఘించిందని, దీంతో అనుమతులు రద్దు చేస్తున్నామంటూ ఎంఈవో సంపత్‌రావు బుధవారం పేర్కొన్నారు. ఈమేరకు పాఠశాల గోడకు నోటీసుల కాపీ అంటించారు.

బొగ్గుబాయి వార్తలు

సింగరేణి ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్


శస్త్ర చికిత్స అనంతరం సత్తయ్యతో వైద్యులు

గోదావరిఖని: ఆరునెలలుగా విపరీతమైన నొప్పితో బాధపడుతున్న వ్యక్తికి సింగరేణి వైద్యులు ఆపరేషన్ చేసి బాధ నుంచి విముక్తి కల్పించారు. వివరాలు.. ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2 ఈపీ ఆపరేటర్ వేగోళం శ్రీనివాస్ తండ్రి సత్తయ్య కుడిచెయ్యి మోచేతిపై గడ్డ ఏర్పడింది. గడ్డ క్రమంగా పెరుగుతూ రావడంతోపాటు నొప్పి అధికమైంది. దీంతో గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రి వైద్యులను సంప్రదించాడు. పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. వయస్సుతోపాటు రిస్క్‌కూడా ఎక్కువ ఉండటంతో అప్రమత్తమైయ్యారు. కిడ్నీ, రక్తహీనత, రక్తపోటు, వృద్ధాప్య తదితర సమస్యలతో బాధపడుతున్న సత్తయ్యకు ఆపరేషన్‌ను విజయవంతంగా చేశారు. కిలోన్నర బరువున్న గడ్డ తొలగించారు. డీవైసీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్‌లు సందీప్, విక్రం, మత్తు డాక్టర్ కాశీశ్వర్‌రావు, డాక్టర్ అంబిక, వినోద్ ఆపరేషన్‌లో పాలుపంచుకున్నారు. దీంతో కుటుంబ సభ్యులు, కార్మికులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

లాభాల వాటా వెంటనే జమచేయాలి


మాట్లాడుతున్న వైవీ రావు

రామగిరి: సింగరేణి సాధించిన లాభాల్లోంచి కార్మికుల వాటాను వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీ రావు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీఏలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ పేరిట లాభాల వాటా ఆపివేయడం సరికాదన్నారు. సంక్షేమ పథకాలకు అడ్డురాని ఎన్నికల కోడ్.. కార్మికుల లాభాల వాటాకు ఎందుకు అడ్డువస్తోందని ప్రశ్నించారు. లాభాల వాటా కోసం ఈనెల 21న చేపట్టిన టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, సమ్మయ్య, గంగాధర్, రాజు, రవికుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఈఏఆర్‌పై వీడియో కాన్ఫరెన్స్


సమావేశంలో పాల్గొన్న అధికారులు

గోదావరిఖని: సెంట్రల్ ఎలక్ట్రికల్ అథారిటీ రెగ్యులేషన్ (సీఈఏఆర్) – 2023పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షించారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎలక్ట్రికల్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజయ్‌సింగ్ మాట్లాడుతూ రెగ్యులేషన్‌లో చేయాల్సిన మార్పులు, చేర్పులపై కూలంకశంగా చర్చించామన్నారు. ఏరియా ఇంజినీర్ నరసింహారావ్, ఓసీపీ–3 అధికారి మధుసూదన్, రక్షణాధికారి బి.రవీందర్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, వర్క్‌షాప్ ఎస్ఈ రాంరెడ్డి ఉన్నారు.

బతుకమ్మ సంబురాలు


బతుకమ్మలతో అధికారులు, మహిళలు

గోదావరిఖని: సింగరేణి ఏరియా ఆస్పత్రి, సూపర్ బజార్ వద్ద బుధవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మలను ఉంచి ఆడిపాడారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, డీజీఎం (పర్సనల్) లక్ష్మీనారాయణ, సూపర్‌బజార్ ఏజీఎం ప్రకాశ్, డిప్యూటీ చీఫ్ మెడిక్ ఆఫీసర్ కిరణ్‌రాజ్‌కుమార్, అంబిక, స్టాఫ్‌నర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

వాటా చెల్లించేందుకు అంగీకారం

గోదావరిఖని: లాభాల వాటా చెల్లించేందుకు అంగీకారం కుదిరిందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న లేదా 21న లాభాల వాటా, దసరా అడ్వాన్స్ కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొన్నారు. ఈమేరకు సింగరేణి యాజమాన్యం ఎన్నికల సంఘం నుంచి గ్రీన్‌సిగ్నల్ తీసుకుందన్నారు.

కాపర్ దొంగల అరెస్ట్

కమాన్‌పూర్: జూలపల్లి శివారులోని సింగరేణి సంస్థకు చెందిన సోలార్ ప్లాంట్‌లో చోరీచేసిన రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన సాదుల కనకయ్య, నీర్ల సతీశ్, గుర్రాల నర్సయ్య, సాదుల వంశీ, కడమంచి మహేశ్‌ను అరెస్టు చేశారు. ఈమేరకు ఎస్సై రాములు బుధవారం తెలిపారు.

21న టోకెన్ సమ్మె

గోదావరిఖని: లాభాల వాటా చెల్లించకుంటే ఈనెల 21న టోకెన్ సమ్మెకు కార్మికులు సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 16న 32 శాతం లాభాల వాటా, పండుగ అడ్వాన్స్‌ను చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటించిందన్నారు. అయినా చెల్లించలేదని, దీంతో ఈ నెల 17న అధికారులకు సమ్మె నోటీసు అందజేశామన్నారు. ఈక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్, జీఎం కోఆర్డినేషన్ సురేశ్, ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. ఈనెల 21న చెల్లింపులు చేసేందుకు ప్రిన్సిపల్ సెక్రటరీ అనుమతిని ఇస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు. చెల్లింపులు చేయకుంటే సమ్మె తప్పదని హెచ్చరించారు.

పెద్దపల్లిలో ‘చిల్లర’ దొంగలు

- పూలకుండీ, నల్లాలు ఎత్తుకెళ్లిన వైనం



పూలకుండీ ఎత్తుకెళ్తున్న వ్యక్తి(సీసీ ఫుటేజీ)

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో చిల్లర దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మత్తుకు బానిసైన కొందరు.. తమకు ఏది కనిపించిన ఎత్తుకెళ్తున్నారు. తమ అవసరాలు తీర్చుకునేందుకు ఇలా చిల్లర దొంగతనాలు చేస్తున్నారు. అమర్‌నగర్‌లోని బుక్‌స్టాల్ ఎదుట పూలకుండీని ఆటోలో వచ్చిన యువకుడు క్షణాల్లో మాయం చేశాడు. ఈ దృశ్యం సీసీఫుటేజీల్లో రికార్డు కావడంతో స్థానికులు నోరెళ్లబెట్టారు. కమాన్, చీకురాయిరోడ్డు, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో మిషన్‌భగీరథ కుళాయిలకు బిగించిన స్టీల్‌నల్లాలనూ వదిలిపెట్టడంలేదు. ఆయా కాలనీల్లో ఇంటిబయట ఏర్పాటు చేసిన నల్లాలను ఎత్తుకెళ్లడంతో నీరంతా వృథాగాపోతోంది. సుభాష్‌నగర్‌లోని ఓ ఇంటి ఆవరణలో నిలిపిన స్కూటీ, ఆటో టైర్లను ఊడదీసి ఎత్తుకెళ్లారు. ఇవి కాకుండా చాలా ప్రాంతాల్లో రోడ్లపై నిలిపిన ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్‌ను కూడా లాగేస్తున్నారు. ఈవిషయాలపై పోలీసులకూ ఫిర్యాదులు అందుతున్నాయి. రాత్రి సమయాల్లో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నా.. చిల్లరదొంగలు వారికంట పడకుండా తమపని కానిచ్చేస్తున్నారు. పోలీసులు నిఘాను మరింత పెంచి చిల్లర దొంగతనాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విజయ్ తీరుతో కాంగ్రెస్‌ను వీడుతున్నాం

- ఓదెల జెడ్పీటీసీ గంట రాములు

పెద్దపల్లిరూరల్: పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నామని, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఒంటెత్తు పోకడలకు నిరసనగానే తాము కాంగ్రెస్ పార్టీని వీడుతున్నామని ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, మాజీ ఎంపీపీలు సి.సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసి ఆ పత్రాలను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి పంపిస్తున్నామన్నారు. విజయరమణారావు నియంతలా వ్యవహరిస్తూ, తమను అవమానిస్తున్నారని ఆవేదన చెందారు. ఈ విషయాన్ని శ్రీధర్‌బాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. సీనియర్లను గౌరవించకనే గత ఎన్నికల్లో విజయ్ ఓడిపోయారన్నారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే తోడుదొంగలు..

పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు తోడుదొంగలేనని గంట రాములు విమర్శించారు. ఇసుక, మట్టి, క్వారీల్లోని సహజ సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. రైస్‌మిల్లర్లతోనూ మనోహర్‌రెడ్డి మిలాఖతై రైతులను దోచుకున్నారని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే రైతుల పక్షాన పోరాడినట్టే చేసి మిల్లర్లతో లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. పార్టీ అధిష్ఠానం బీసీలకు టికెట్లు కేటాయిస్తామని చెప్పిమాట తప్పిందని పేర్కొన్నారు. నాయకులు నాగరాజు, హాజీ పాల్గొన్నారు.

తీరని ఆధార్ కష్టాలు



ఆరోగ్యశ్రీ అప్‌డేట్ కోసం కేవైసీ అవసరమని కొందరు, వేలిముద్రలు పడడం లేదని మరికొందరు.. రేషన్ బియ్యం కోసమని ఇంకొందరు.. ఇలా ఆధార్ వివరాల అప్‌డేట్‌కు 15రోజులుగా నమోదు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా, తమ సీరియల్ నంబరు రావట్లేదని వాపోతున్నారు. స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడాలోని ఆధార్ నమోదు సెంటర్ వద్ద బుధవారం ఇలా బారులుతీరిన ప్రజలు ‘సాక్షి’కి కనిపించారు.

– సాక్షి ఫోటోగ్రాఫర్, పెద్దపల్లి

పొలిటికల్ కూలీలకు గిరాకీ

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఓ పార్టీ గతేడాది నుంచి విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తోంది. ప్రచారంలో మందిమార్బలంతో కొంతహడావుడి చేయాలి. ఇందుకోసం రోజువారీగా కూలీలను వినియోగిస్తే.. ఖర్చుతడిసి మోపెడుతుందని నాయకులు భావించారు. ఇంకేముంది.. తాము ఎక్కడికి వెళ్లినా.. ధర్నాలు, ర్యాలీలు, ఇంటింటా ప్రచారం చేసినా.. తమతో సుమారు 100మంది అనుచరులు ఉండేలా పెయిడ్ కార్యకర్తలను నియమించుకుంటు న్నారు. వారికి నెలవారీగా జీతభత్యాలు చెల్లిస్తూ వస్తున్నారు.

పెద్దపల్లిలో మరోపార్టీ ఎమ్మెల్యేగా అభ్యర్థిత్వం ఖరారుతో కుటుంబ సమేతంగా ఎన్నికల ప్రచారం హోరెత్తిస్తున్నారు. అయితే, వారితో పార్టీ కేడర్ తక్కువ, పెయిడ్ కార్యకర్తలు ఎక్కువగా కనిపిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయకూలీలకు పనిలేకపోవడం, ఎన్నికల సీజన్ ప్రారంభంకావడంతో చాలామంది రోజువారీ కూలీలు ప్రచారానికి వెళ్తున్నారు. దీంతో గ్రామాల్లో జెండా మోసేకూలీలకు గిరాకీ పెరిగింది.

- జిల్లాలో ప్రచారం జోరు పెంచిన పార్టీలు
- ఇంటింటి ప్రచారం, ర్యాలీలతో హోరెత్తిస్తున్న వైనం
- లీడర్స్ వెంట క్యాడర్ పేరిట రాజకీయ కూలీలు
- పర్మినెంట్ కూలీలను ఏర్పాటు చేసుకుని నెలవారీ జీతాలు



సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల పండుగ రావడంతో పొలిటికల్ కూలీలకు గిరాకీ పెరిగింది. ఎమ్మెల్యే అభ్యర్థి అంటే మినిమం పక్కన వందో, యాభయో మంది ఉండాలి. నేతల వెంట నడిచే కార్యకర్తల సంఖ్యను బట్టి ఆ నాయకుడి బలాన్ని అంచనా వేసే సంస్కృతి రాజకీయాల్లో ప్రస్తుతం కనిపిస్తోంది. దీంతో తమ ప్రచారంలో జనాలు వందమందికి తక్కువ కాకుండా ఉండేలా నేతలు చూసుకుంటు న్నారు. దీంతో ఏ పార్టీ నేతల సమావేశాలు, ర్యాలీల్లో చూసినా జనం కిక్కిరిసి కనిపిస్తున్నారు. బలప్రదర్శనగా మారుతున్న ప్రచారసరళితో చాలామంది రోజువారీ కూలీలు కూడా ఆయా పార్టీల కార్యక్రమాలకు హాజరై ఉపాధి పొందుతు న్నారు. పార్టీ జెండా పట్టుకుని కార్యక్రమంలో పాల్గొంటే, లేదా సమావేశంలో పాల్గొంటే రూ.300 నుంచి రూ.500 వరకు కూలిగా అందుతోంది. మగ వాళ్లకైతే డబ్బుతోపాటు మందు, బిర్యానీ అదనంగా చెల్లిస్తున్నారు నేతలు.

ఖర్చులు తడిసి మోపెడు..

పార్టీ జెండా మోసేందుకు వచ్చే దినసరి కూలీలు సవాలక్ష కండీషన్లు పెడుతున్నారు. బహిరంగసభకు వస్తే ఎంతసేపు ప్రాంగణంలో కూర్చోవాలో ముందే చెబితే.. దానినిబట్టే వస్తున్నారు. నేతల ఆలస్యంతో సభ ఆలస్యమైతే.. ఇంకోవంద అదనంగా ఇస్తేకానీ సభపూర్తి అయ్యేవరకు ఉండటం లేదు. తక్కువ అమౌంట్ ఇచ్చినా, ఆలస్యమైనా కార్యకర్తలు తిరుగుముఖం పట్టడంతో నేతలు వారిని సముదాయించలేక తలలు పట్టుకుంటున్నారు.

తెలంగాణలో పర్యటన కొత్త అనుభూతి

- జిల్లాలో విదేశీ మహిళల యాత్ర
- ఉమ్మడి జిల్లాలో బైక్ రైడ్

జన్నారం: తెలంగాణ రాష్ట్రంలో బైక్ రైడ్ ద్వారా పర్యటించడం కొత్త అనుభూతిని ఇచ్చిందని విదేశీ మహిళలు పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా హైదరాబాద్ నుంచి మోటార్‌సైకిళ్లపై వివిధ దేశాల మహిళలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల, కడెం ప్రాంతాల్లో పర్యటించారు. మంగళవారం రాత్రి మంచిర్యాల జిల్లా జన్నారంలోని హరిత రిసార్ట్‌లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. మండలంలోని గిరిజన గ్రామం మల్యాలలో మహిళలతో మాట్లాడారు. బతుకమ్మ ఆటను తిలకించారు. బుధవారం ఉదయం అటవీ డివిజన్‌లోని మైసమ్మకుంట, బైసన్‌కుంట ప్రాంతాల్లో పర్యటించి వరంగల్‌కు పయనమయ్యారు. యూఎస్‌ఏ, సింగాపూర్, యూరప్, థాయిలాండ్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన తొమ్మిది మంది మహిళలు అలిసన్ గ్రుస్ ప్రారంభించిన ఫ్రీ డబ్ల్యూ, ఒక ఫ్రెంచ్ మోటార్‌సైకిలిస్ట్, మహిళలకు ఆర్థిక అవకాశాలను అందించేందుకు అసాధారణమైన మోటార్‌బైక్ రైడింగ్ చేస్తున్నట్లు తెలిపారు. మోటారుసైకిళ్లపై



మోటారుసైకిళ్లపై మహిళలు

తెలంగాణలో పర్యటిస్తూ మహిళలను కలవడం, బతుకమ్మ సంబరాలు, పర్యాటక ప్రదేశాలను సందర్శించడం, కళాకారులు, చేనేత కార్మికులను కలుసుకోవడం కోసం తెలంగాణను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు.

బైక్ ర్యాలీ ఇలా..

మహిళా బైకర్ల తొమ్మిది రోజుల మోటార్ సైకిల్ యాత్ర మహబూబ్‌నగర్, వికారాబాద్, నిర్మల్, వరంగల్ జిల్లాలతోపాటు పోచంపల్లి మీదుగా హైదరాబాద్ వరకు సాగి అక్కడ బతుకమ్మ వేడుకలతో ముగుస్తుంది.



బహుమతి అందజేస్తున్న విదేశీ మహిళ

సంప్రదాయాలు నచ్చాయి..



తెలంగాణ రాష్ట్రంలో పర్యటించడం, జన్నారంలో అడవుల అందాలు తిలకించడం, గిరిజనులతో మమేకమై మాట్లాడడం కొత్త అనుభూతినిచ్చింది. గిరిజన మహిళల బతుకమ్మ ఆటలను తిలకించి కొందరికి బహుమతులు అందించాం. తెలంగాణ పర్యటనలో చాలా విషయాలు తెలుసుకున్నాం. సంస్కృతి, సంప్రదాయలు బాగా నచ్చాయి.

– పెన్ని, యూఎస్‌ఏ

అట్టహాసంగా యోగాసన పోటీలు ప్రారంభం

- 15 జిల్లాల నుంచి 700 మంది క్రీడాకారుల హాజరు



యోగా క్రీడాకారులతో మనోహర్ కుమార్, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి



క్రీడాకారుడి యోగాసనం
అబ్బురపరిచిన యోగాసనాలు

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ యోగా సంఘం, కరీంనగర్ జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్లో బుధవారం 10వ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు తెలంగాణ వ్యాప్తంగా 15 జిల్లాల నుంచి సుమారు 700 మంది క్రీడాకారులు, 60 మంది కోచ్, మేనేజర్, టెక్నికల్ అఫీషియల్‌లో హాజరయ్యారు. 8 సంవత్సరాల నుంచి మొదలుకొని 45 సంవత్సరాల్లోపుతో పాటు 45కు పైగా ఉన్నవారికి పురుషులకు, మహిళలకు, బాలబాలికలకు వేరువేరుగా పోటీలను నిర్వహించారు. రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో అద్వితీయ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నవంబర్ 23 నుంచి 26 వరకు అస్సాం రాష్ట్రం గౌహతిలో జాతీయ స్థాయి యోగా పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. అంతకుముందు ఉదయం ఈ పోటీలను మానేరు విద్యాసంస్థల అధినేత, ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం ప్యాట్రన్ కడారి అనంతరెడ్డి, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి కె.మనోహర్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో యోగాసనాలను ప్రతి ఒక్కరూ చేయాలన్నారు. మానేరు విద్యాసంస్థలు క్రీడలకు, క్రీడాపోటీల నిర్వహణకు ఎల్లప్పుడు ముందుంటుందని, ప్రతీ సంవత్సరం ఏదో ఒక క్రీడలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కరీంనగర్ జిల్లా నాలుగోసారి ఆతిథ్యం ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. యోగాకు కేరాఫ్ అడ్రస్‌గా కరీంనగర్ జిల్లా మారిందని, ఇక్కడి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. జిల్లా ఒలంపిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేష్ రెడ్డి, యోగా సంఘం జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షుడు కన్నకృష్ణ, రాష్ట్ర యోగ సంఘం బాధ్యులు కమలాకర్ బాలరాజుతోపాటు కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు చేసిన యోగా విన్యాసాలు అబ్బురపరిచాయి. ముఖ్యంగా 8 నుంచి 10 సంవత్సరాల చిన్నారులు, 45 సంవత్సరాల వయసు పైబడిన మహిళలు, పురుషుల యోగాసనాలు ఆకట్టుకున్నాయి.

తొలిరోజు విజేతలు వీరే..

8 నుంచి 10 సంవత్సరాల బాలికల విభాగంలో సిహెచ్ నితిగ్న చౌదరి, రంగారెడ్డి(ప్రథమ) అభిలాష రెడ్డి, నల్గొండ(ద్వితీయ) చేరుబ అమరిస్, నిజామాబాద్(తృతీయ) స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగంలో చిన్మయ్ రెడ్డి(రంగారెడ్డి), కుష్వక్ రెడ్డి(హైదరాబాద్), మన్విత్ రామ్(కరీంనగర్) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.

ఉద్యోగుల నిబద్ధతతోనే ప్రగతి పథం

- ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్



ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్ఎం

ఆదిలాబాద్: ఉద్యోగుల నిబద్ధతే సంస్థను ప్రగతి పథంలో ముందుకు నడుపుతోందని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపో గ్యారేజీలో బుధవారం ఏర్పాటు చేసిన సెప్టెంబర్ ఆదర్శ ఉద్యోగుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సంస్థను లాభాల బాట పట్టించేలా నిరంతరం ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉద్యోగులు, సిబ్బంది శ్రమ ఫలితంగానే ఇటీవల శ్రావణమాసం చాలెంజ్‌లో రాష్ట్రంలోనే ఆదిలాబాద్ రీజియన్ మూడో స్థానంలో నిలిచిందన్నారు. డిపో పరిధిలో నెల రోజులకు, జోనల్ పరిధిలో ఆరు నెలలకు, రాష్ట్రస్థాయిలో ఏడాదికి ఒకసారి ఉద్యోగుల పనితీరుపై అభినందన సభల ఏర్పాటు ఉంటుందన్నారు. ఇదే ఉత్సాహంతో పనిచేసి వందరోజుల గ్రాండ్ చాలెంజ్‌లో ఆదిలాబాద్ రీజియన్ మొదటి స్థానం సాధించేలా పాటుపడాలన్నారు. అనంతరం ఆర్ఎంను ఉద్యోగులు సన్మానించి, జ్ఞాపిక అందించారు. అలాగే దసరా పండుగ పురస్కరించుకొని డిపోలో పని చేస్తున్న స్వీపర్లకు ఆర్ఎం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు ప్రణీత్, ప్రవీణ్, డీఎం కల్పన, ఎంఎఫ్ రాజేందర్, సీఐ విశ్వనాథ్, రిజర్వేషన్ ఇన్‌చార్జి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నీడ కోసం పాట్లు



వాహనాలను చెట్ల నీడలో నిలిపిన దృశ్యం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని కాలేజీ రోడ్డులో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం వద్ద ఒక్క చెట్టు కూడా లేకపోవడం, వాహనాల పార్కింగ్‌కు సరైన నీడ సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అర కిలోమీటరు దూరంలోని రోడ్డు డివైడర్ల మధ్య ఉన్న చెట్ల నీడనే వాహనాలను నిలపాల్సి వస్తోంది. గర్భిణులను దూర ప్రాంతాల నుంచి ఎంసీహెచ్‌కు తరలించే 102 వాహనాలతోపాటు ఆలనా వాహనాలు సైతం ఎంసీహెచ్‌కు వచ్చి చెట్ల కింద పార్కింగ్ చేసి ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.

బాసరలో భక్తుల రద్దీ



ప్రసాదం పంపిణీ చేస్తున్న సభ్యులు

భైంసా: బాసరలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు బుధవారం అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ప్రత్యేక క్యూలైన్‌లో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం చిన్న పిల్లలతో అక్షరాభ్యాస పూజలు జరిపించారు. భక్తులకు మహారాష్ట్రలోని ధర్మాబాద్ వ్యాపార సంఘం సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు. లక్ష్మీకాంత్, మారుతిపటేల్‌తోపాటు పలువురు నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ప్రసాదాలు పంపిణీచేస్తున్నారు. మరోవైపు నాందేడ్‌కు చెందిన జగదీశ్ మహారాజ్ గాడిపుర ఆధ్వర్యంలో నిత్యాన్నదానం చేస్తున్నారు. ఆలయ ఈవో విజయరామారావు నిత్యాన్నదానంలో భక్తులకు వడ్డించారు.



నిత్యాన్నదానంలో భక్తులు

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 52 పోస్టులు

మచిలీపట్నంలోని ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ.. కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 52
» **పోస్టుల వివరాలు:** ఫిజియోథెరపిస్ట్–02, స్టాఫ్ నర్స్–24, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్–08, మెడికల్ ఆఫీసర్–10, ఎల్‌జీఎస్–04, సపోర్టింగ్ స్టాఫ్–03, సెక్యూరిటీ గార్డ్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సర్టిఫికేట్ కోర్సు,జీఎన్‌ఎం/బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, పరాసుపేట, నాయర్ బడ్డీ సెంటర్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.10.2023.
» **వెబ్‌సైట్:** krishna.ap.gov.in

అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 56 పారా మెడికల్ పోస్టులు

అనంతపురం ఆరోగ్య వైద్య,కుటుంబ సంక్షేమ శాఖ..అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 56
» **పోస్టుల వివరాలు:**ఫార్మసిస్ట్ గ్రేడ్2–02, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2–02, రేడియోగ్రాఫర్–01, థియేటర్ అసిస్టెంట్–08, ల్యాబ్ అటెండెంట్–02, పోస్ట్ మార్టమ్ అసిస్టెంట్–03, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్/రికార్డ్ అసిస్టెంట్–02, జనరల్ డ్యూటీ అటెండెంట్ జీడీఏ/ఎంఎన్‌వో/ఎఫ్ఎన్‌వో–28, ఆఫీస్ సబార్డినేట్–01, ప్లంబర్–05, ఎలక్ట్రీషియన్–01, ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రిక్ టెక్నీషియన్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ,డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ, నర్సింగ్ ఆర్డర్లీ కోర్సు, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అనంతపురంలోని హాస్పిటల్ సర్వీసస్ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలోని నిర్దిష్ట కౌంటర్లలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.10.2023.
» **వెబ్‌సైట్:** ananthapuramu.ap.gov.in

ప్రకాశం జిల్లాలో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టులు

ఒంగోలులోని కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం.. కనిగిరి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఈ–డివిజనల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
» **అర్హత:** బీసీఏ/బీఎస్సీ/బీఈ, బీటెక్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి. వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.22,500 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.10.2023.
» **వెబ్‌సైట్:** prakasam.ap.gov.in

విజయనగరం జిల్లా హాస్పిటల్‌లో వివిధ ఉద్యోగాలు

విజయనగరంలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్), డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
» **పోస్టుల వివరాలు:** ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రీ టెక్నీషియన్–02, జనరల్ డ్యూటీ అటెండెంట్–05, ఆఫీస్ సబార్డినేట్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, బీఎస్సీ(ఆడియాలజీ), డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అర్హత కలిగిన సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలతో పాటు జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్, జిల్లా ఆసుపత్రి, విజయనగరం కార్యాలయంలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.10.2023.
» **వెబ్‌సైట్:** https://vizianagaram.ap.gov.in

జెన్‌కోలో.. ఏఈ జాబ్స్

టీఎస్ జెన్‌కో 339 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్ అర్హతతో ఈ ఉద్యోగాలకు పోటీపడొచ్చు. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు. జెన్‌కో పరీక్ష తేదీని కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. టీఎస్ జెన్‌కో ఏఈ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

» 339 ఏఈ పోస్టులకు టీఎస్ జెన్‌కో నోటిఫికేషన్
» బీటెక్ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
» డిసెంబర్ 3న రాత పరీక్ష
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకం

తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్.. టీఎస్ జెన్‌కోగా సుపరిచితం. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలను నిర్వహించే ఈ సంస్థ.. మానవ వనరుల నియామకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రతి ఏటా ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. తాజాగా.. అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

నాలుగు బ్రాంచ్‌లు.. 339 పోస్టులు

- టీఎస్ జెన్‌కో తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం నాలుగు బ్రాంచ్‌లలో 339 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–జనరల్ రిక్రూట్‌మెంట్–145 పోస్టులు, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్– 42 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్)–జనరల్ రిక్రూట్‌మెంట్–74 పోస్టులు; లిమిటెడ్ రిక్రూట్‌మెంట్–3 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)–జనరల్ రిక్రూట్‌మెంట్–25 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)–జనరల్ రిక్రూట్‌మెంట్–1,లిమిటెడ్ రిక్రూట్‌మెంట్–49 పోస్టులు
- నాలుగు బ్రాంచ్‌లకు సంబంధించి లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ పరిధిలో 94 పోస్టులు, జనరల్ రిక్రూట్‌మెంట్ విధానంలో 245 పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

విద్యార్హతలు

- ఏఈ(ఎలక్ట్రికల్): ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. ▪ ఏఈ(మెకానికల్): మెకానికల్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- ఏఈ(ఎలక్ట్రానిక్స్): ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)/ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ ఇన్‌స్టుమెంటేషన్ అండ్ పవర్/పవర్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

వయసు

జూలై 1, 2023 నాటికి 18–44 ఏళ్లు ఉండాలి. ఎస్సీ / ఎస్టీ/ ఓబీసీ(నాన్ -క్రీమీలేయర్)/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు ఇస్తారు.

వేతనం

తుది విజేతల జాబితాలో నిలిచి నియామకం ఖరారు చేసుకుంటే.. రూ.65,600–రూ.1,31,220 వేతన శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది.

ఎంపిక ఇలా

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా రిజర్వేషన్లు, లోకల్ కేడర్ తదితర నిబంధనలను అనుసరించి తుది జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు. ఆ క్రమంలో ఆయా కేటగిరీల వారీగా కనీస అర్హత మార్కుల నిబంధనను అమలు చేస్తారు. ఓసీ, ఈడబ్ల్యూఎస్, క్రీడాకారుల కేటగిరీకి చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులు; బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; పీహెచ్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి.

వంద మార్కులకు రాత పరీక్ష

- రాత పరీక్షను రెండు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్–ఎలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 80 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్–బిలో ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, తెలంగాణ హిస్టరీ, సంస్కృతి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నమోదైన అభివృద్ధి, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ అంశాల నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. రాత పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
- పరీక్షను ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తారు.

రెండేళ్ల ప్రొబేషన్, శిక్షణ

నియామకం ఖరారైన వారికి రెండేళ్ల పాటు ప్రొబేషన్, శిక్షణ విధానాన్ని అమలు చేస్తారు. తొలి ఏడాదిని శిక్షణ సమయంగా, రెండో ఏడాదిని ప్రొబేషన్ పీరియడ్‌గా పరిగణిస్తారు. ప్రొబేషన్ నిబంధనలతోపాటు.. సర్వీస్ బాండ్‌ను కూడా టీఎస్ జెన్‌కో అమలు చేస్తోంది. నియామకం ఖరారు చేసుకున్న వారు ట్రైనింగ్, ప్రొబేషన్‌లకు కేటాయించిన రెండేళ్లతో కలిపి.. మొత్తం అయిదేళ్లపాటు జెన్‌కోలో విధులు నిర్వహిస్తామని సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.



ఎస్ఈ స్థాయికి చేరుకునే అవకాశం

టీఎస్ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా కొలువు దీరిన వారు.. భవిష్యత్తులో సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. సర్వీసు నిబంధనలను అనుసరించి.. ఏఈ తర్వాత.. అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, ఆ తర్వాత డివిజనల్ ఇంజనీర్, అనంతరం సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థానాలకు పదోన్నతులు లభిస్తాయి. చీఫ్ ఇంజనీర్ స్థాయికి కూడా చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**అక్టోబర్ 29,2023
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబర్ 3, 2023
- **రాత పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, సికింద్రాబాద్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో.
- **వెబ్‌సైట్:** www.tsgenco.co.in

రాత పరీక్షలో రాణించేలా

- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఎలక్ట్రికల్ మెటీరియల్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ బ్యాటరీస్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్,డీసీ మెషీన్స్, మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఏసీ మెషిన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ అండ్ ఎస్టిమేషన్, యుటిలైజేషన్ అండ్ ట్రాక్షన్, పవర్ ఎలక్ట్రానిక్స్‌కు, అనలాగ్ అండ్ డిజిటల్ ఎలక్ట్రానిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రికల్ మెషీన్స్, పవర్ సిస్టమ్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, థర్మోడైనమిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణ అవగాహన పొందాలి.
- **మెకానికల్ బ్రాంచ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, మెకానిక్స్ ఆఫ్ మెటీరియల్స్, థియరీ ఆఫ్ మెషీన్స్, వైబ్రేషన్స్, థర్మోడైనమిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, క్యాస్టింగ్, ఫార్మింగ్, జాయింగ్ ప్రక్రియలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా.. కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్షన్ అండ్ ప్లానింగ్ కంట్రోల్, ఇన్వెంటరీ కంట్రోల్, ఆపరేషన్స్ రీసెర్చ్ ఐసీ ఇంజన్స్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- **సివిల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, సాలిడ్ మెకానిక్స్, స్ట్రక్చరల్ అనాలిసిస్, బిల్డింగ్ మెటీరియల్ అండ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, ఫ్లూయిడ్ మెకానిక్స్, ఓపెన్ ఛానెల్ ఫ్లో, పైప్ ఫ్లో, హైడ్రాలజీ అండ్ వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, వాటర్ సప్లై ఇంజనీరింగ్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జియో టెక్నికల్ ఇంజనీరింగ్, ఎయిర్ పొల్యూషన్, సర్వేయింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ విభాగాల్లోని అంశాల్లో దృష్టి పెట్టాలి.
- **ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ అభ్యర్థులు..** నెట్‌వర్క్స్, సిగ్నల్స్, సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్, అనలాగ్ సర్క్యూట్స్, డిజిటల్ సర్క్యూట్స్, కంట్రోల్ సిస్టమ్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రో మ్యాగ్నటిక్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెజర్‌మెంట్స్‌కు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలి.
- జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ కోసం ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. తెలంగాణకు సంబంధించి ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించాలి. తాజాగా అమలవుతున్న అభివృద్ధి పథకాలను తెలుసుకోవాలి. తెలంగాణ ప్రాంత భౌగోళిక స్వరూపం, విశిష్టతలు తెలుసుకోవాలి. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించిన చరిత్రపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తెలంగాణ తొలి ఉద్యమ దశ నుంచి తెలంగాణ ఆవిర్భావం వరకు పలు ముఖ్యమైన అంశాలను ఔపోసన పట్టాలి.వీటితోపాటు తెలంగాణ సంస్కృతి, సామాజిక పరిస్థితులు, కళలు, సాహిత్యం వంటి అంశాలను కూడా చదవాలి.

ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అనలిటికల్ ఎబిలిటీ విషయంలో గ్రాఫ్స్, డేటా అనాలిసిస్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్‌ను అభ్యసనం చేయాలి.

అన్వయ దృక్పథం

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ముందుకు సాగాలి. ముఖ్యంగా సబ్జెక్ట్ విభాగానికి సంబంధించి బీటెక్ స్థాయిలోని అకడమిక్ పుస్తకాలను ఆలంబనగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి. మోడల్ పేపర్లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపేందుకు దోహదం చేస్తుంది.